WWW.EPAPER.MAHAADAILY.COM

# మహా పత్రిక

తెలుగు

## ఖమ్మం

### భద్రాద్రి కొత్తగూడెం

29-05-2024 | గురువారం





# ప్రభుత్వ దవాఖానలో కలెక్టర్ సతీమణి ప్రసవం

- పండంటి మగ బిడ్డకి జన్మనిచ్చిన కొత్తగూడెం జిల్లా కలెక్టర్ సతీమణి
- కొన్ని నెలలుగా ప్రభుత్వ ఆసుపత్రిలోనే పరీక్షలు



వివరాలు 5లో

# తహసీల్దార్ కార్యాలయాల్లో దళారీల దందా!



ముదిగొండ తహశీల్దార్ కార్యాలయం అక్రమ వసూళ్లకు అడ్డాగా మారిందని ఆరోపణలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి. కార్యాలయంలో దళారులు రాజ్యమేలుతున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. భూ భారతి రిజిస్ట్రేషన్ స్లాట్ బుక్ చేసుకొని వచ్చేవారికి గంటల తరబడి రిజిస్ట్రేషన్ కి వేచి ఉండాల్సి వస్తుంది. తహసీల్దార్లు దళారీలను, ఏజెంట్లను ఏర్పాటు చేసుకున్నారనే ఆరోపణలున్నాయి. రిజిస్ట్రేషన్ స్లాట్ బుక్ చేసుకొని వెళ్లిన రైతులకు దగ్గరుండి రూ.500 రూ. 1000 అప్ప చెపితేనే పని జరుగుతుందని లేకుంటే జరగదని ప్రజలకు బహిరంగ చర్చించుకుంటున్నారు. మధ్యవర్తులు ద్వారా తమ చేతికి మట్టి అంటకుండా పనులు చేయించుకుంటున్నారు. డబ్బులు ఇవ్వకుంటే అనేక కొర్రీలు పెట్టి రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నారు. ప్రతి పనికి ఓ రేటు ఫిక్స్ చేసి మరి వసూలు చేస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా ఉన్నత అధికారులు దృష్టి సారించి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ముదిగొండ , మహా

వివరాలు 8లో

# అశ్రునయనాల మధ్య ముగిసిన మాజీ ఎమ్మెల్యే మదన్ లాల్ అంత్యక్రియలు





# డబ్బు ఇస్తేనే ఎంట్రీ..

**2000 ఇస్తేనే రేషన్ కార్డు**

- రెవిన్యూ కార్యాలయాల్లో చిరుద్యోగుల హవా
- డీలర్ల అండతో సాగుతున్న రేషన్ దందా
- ప్రతిష్టాత్మక పథకానికి అవినీతి మచ్చ

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రజల ఆర్థిక భద్రత కోసం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన రేషన్ కార్డుల జారీ ప్రక్రియ ఖమ్మం జిల్లాలో మాత్రం అవినీతి తిప్పలలో మగ్గుతోంది. నిజంగా అర్హత కలిగిన పేద కుటుంబాలకు కార్డులు ఆలస్యం అవుతుండగా, రూ.2000 లంచం ఇచ్చినవారికి మాత్రం వెంటనే అందుతున్న వాస్తవం వెలుగులోకి వచ్చింది. మండల రెవెన్యూ కార్యాలయాల్లో ఉద్యోగుల చేతుల్లోకి వచ్చిన ఈ పవిత్ర పథకం నడక ఇప్పుడు 'లంచాలపై ఆధారపడి సాగే వ్యవస్థ'గా మారింది. ఈ దుర్వ్యవస్థ వెనుక డీలర్లకు ఉన్న స్థానిక అండ, చిరువుద్యోగి చూపుతున్న కణతల వైనం స్పష్టంగా కనిపిస్తోంది. - మహా, ఖమ్మం

వివరాలు 9లో

మహా పత్రిక
ANN తెలుగు

## మాజీ ఎమ్మెల్యే మదన్ లాల్‌కు తుమ్మల నివాళి



**ఖమ్మం, మహా :** వైరా మాజీ ఎమ్మెల్యే బానోత్ మదన్ లాల్ ఆకస్మిక మరణం నేపథ్యంలో, ఆయన పార్థివ దేహానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు. బుధవారం రఘునాథపాలెం మండలంలోని ఈర్లపూడి గ్రామానికి చేరుకున్న మంత్రి తుమ్మల, మదన్ లాల్ కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలిపారు.గత రాత్రి గుండెపోటుతో మదన్ లాల్ హఠాన్మరణం చెందడం బాధాకరమని మంత్రి పేర్కొన్నారు. ఆయన ఆత్మకు శాంతి కలగాలని ఆకాంక్షిస్తూ, కుటుంబానికి ప్రభుత్వం తరఫున పూర్తి సహాయం అందిస్తామని భరోసా ఇచ్చారు.

## ఘనంగా ఎన్టీఆర్ నూట రెండవ జయంతి



**ఖమ్మం, మహా.** ఖమ్మం స్థానిక ఎన్ఎస్పి కాలనీ నందు సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య ఆధ్వర్యంలో నందమూరి తారక రామారావు నూట రెండవ జయంతి వేడుకలని సత్తుపల్లి మాజీ శాసనసభ్యులు సండ్ర వెంకట వీరయ్య ఖమ్మం లోని వారి క్యాంపు కార్యాలయంలో జయంతి ఉత్సవాలు జరపడం జరిగింది. ఈ యొక్క కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా శ్రీ సండ్ర వెంకట వీరయ్య పాల్గొన్నారు. ఈ యొక్క కార్యక్రమంలో ఖమ్మం మాజీ కార్పొరేటర్ మచ్చ నరేంద్ర, గంగవరపు లక్ష్మీ దయాకర్ , షేక్ సయ్యద్ బాషా గారు తాళ్లూరి హనుమంతరావు , పెనుబల్లి మండలం లంకాసాగర్ గ్రామ మాజీ సర్పంచ్ మందడపు అశోక్ , ఇతర నాయకులు పాల్గొన్నారు.



తెలుగు జాతి గర్వించదగ్గ మహానటుడు, ప్రజానాయకుడు నందమూరి తారకరామారావు 102వ జయంతిని పురస్కరించుకుని ఖమ్మం బైపాస్ రోడ్డులోని విగ్రహం వద్ద ఆయనకు పరిశ్రమాభివృద్ధి సంస్థ ఛైర్మన్ మువ్వా విజయబాబు, జిల్లా సహకార కేంద్ర బ్యాంకు డైరెక్టర్ తుళ్లూరి బ్రహ్మయ్య లు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మువ్వా విజయబాబు మాట్లాడుతూ - "సినీ రంగానికే పరిమితం కాకుండా రాజకీయాల్లోనూ ఎన్టీఆర్ ఒక ధృవతార. పేదోడి గుండె ధైర్యంగా నిలిచిన నాయకుడు. తెలుగు జాతి ఉన్నంతకాలం ఎన్టీఆర్ పేరు చిరస్మరణీయంగా నిలుస్తుంది. కేంద్ర ప్రభుత్వం ఆయనకు భారతరత్న ఇవ్వాలి" అని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో చింతనిప్పు కృష్ణ చైతన్య, తోటకూరి శివయ్య, షేక్ ఇమామ్, సామినేని చైతన్య, బోజెడ్ల రవికుమార్, దుర్గా, మందడపు నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# ఆలయ అభివృద్ధి పనులు సకాలంలో పూర్తి చేయాలి

- ఆలయ అభివృద్ధి కోసం 4 కోట్ల 74 లక్షల 50 వేల రూపాయలు మంజూరు
- స్వామి ఆశీస్సులతో ప్రజా సంక్షేమ కార్యక్రమాల అమలు
- శ్రీ యోగానంద లక్ష్మీనరసింహస్వామి దేవాలయం పునర్నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసిన డిప్యూటీ సి.ఎం మల్లు భట్టి విక్రమార్క





**ముదిగొండ, మహా :** శ్రీ యోగానంద లక్ష్మీనరసింహస్వామి దేవాలయ అభివృద్ధి పనులు సకాలంలో పూర్తి చేయాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక, ఇంధన శాఖల మంత్రి భట్టి విక్రమార్క మల్లు అన్నారు. బుధవారం రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ముదిగొండ మండలం యడవల్లి గ్రామంలో శ్రీ యోగా నంద లక్ష్మీనరసింహస్వామి దేవాలయం పునర్నిర్మాణ పనులకు, వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ దశాబ్దాల కాలంగా ప్రజలు ఆరాధ్య దైవంగా శ్రీ యోగా నంద లక్ష్మీ నరసింహ స్వామిని కొలుస్తున్నారని తెలిపారు. దేవాలయంలో ఉన్న ఉత్సవ విగ్రహాలను గ్రామంలోని దేవాలయంలో నిత్య పూజ నిమిత్తం ఉంచి కళ్యాణ సమయంలో తీసుకొని వచ్చేవారని డిప్యూటీ సీఎం తెలిపారు. శ్రీ యోగానంద లక్ష్మీ నరసింహస్వామి ఆశీర్వాదంతో తన ఎన్నికల ప్రచారం ప్రారంభమయిందని, ఆ స్వామి వారి ఆశీస్సులతో నేడు ఆలయ అభివృద్ధికి 4 కోట్ల 74 లక్షల 50 వేల రూపాయలను ప్రభుత్వంచే మంజూరు చేయించడం జరిగిందని అన్నారు. దేవాలయంకు కేటాయించిన అభివృద్ధి నిధులు పూర్తి స్థాయిలో సద్వినియోగం కావాలని, ఆలయ పునర్నిర్మాణం పనులు సకాలంలో నాణ్యతతో పూర్తి కావాలని, స్వామి ఆశీస్సులు ప్రజలకు ఉండాలని ప్రార్థిస్తూ యాగం నిర్వహించామని అన్నారు. వాతావరణ శాఖ సూచనల ప్రకారం వర్షాభావ పరిస్థితులు ఉన్నాయని తెలుపగా అధికారులు కొంత ఆందోళన చెందినప్పటికీ, దేవుని కార్యక్రమానికి ఆటంకాలు ఆ స్వామి తొలగిస్తారని భావించామని, అదే విధంగా నేడు వర్షం లేదని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా దేవాలయాల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. భగవంతుని ఆశీర్వాదంతో ఋతుపవనాలు ముందస్తుగా వచ్చాయని తెలిపారు. ప్రజల సమగ్ర అభివృద్ధికి ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపట్టామని అన్నారు . మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం,500 రూపాయలకే గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, ఆరోగ్య శ్రీ పరిమితి 10 లక్షలకు పెంపు, రేషన్ కార్డు ద్వారా సన్న బియ్యం సరఫరా, రాజీవ్ యువ వికాసం క్రింద స్వయం ఉపాధి యూనిట్లు, ఇందిరా మహిళా శక్తి క్రింద మహిళలకు వడ్డి లేని రుణాలు, 22 వేల కోట్లతో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం, 12 వేల 500 కోట్లతో ఇందిరా సౌర గిరి జల వికాసం పథకాలు చేపట్టామని అన్నారు. రైతులకు 2 లక్షల రుణమాఫీ, రైతు భరోసా 12 వేల రూపాయలు పెంచి అమలు చేస్తున్నామని, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా క్రింద కూలీలకు 12 వేల రూపాయలు అందిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్ నాయక్, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, రాష్ట్ర హస్తకళల అభివృద్ధి సంస్థ చైర్మన్ నాయుడు సత్యనారాయణ, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి, ఖమ్మం ఆర్డీవో నర్సింహారావు, సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ఎన్టీఆర్ జయంతి వేడుకలు నిర్వహించిన టిడిపి శ్రేణులు




**ఖమ్మం సిటీ , మహా:** తెలుగుదేశం పార్టీ అడహక్ కమిటీ కన్వీనర్ డాక్టర్ వాసిరెడ్డి రామనాదం ఆదేశానుసారం తెలుగుదేశంపార్టీ వ్యవస్థాపకులు మాజీ ముఖ్యమంత్రి వర్యులు నందమూరి తారకరామారావు 102వ జయంతి వేడుకలు ఖమ్మం జిల్లా కార్యాలయంలో హడ్ హక్ కమిటీ సభ్యులు కొండబాల కర్ణాకర్ అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. మొదటగా ఎన్టీఆర్ సర్కిల్ లో గల అన్నగారి విగ్రహానికి భారీ పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. తదుపరి పార్టీ కార్యాలయానికి చేరుకుని కార్యాలయంలోని ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి, కార్యాలయం ముందు జెండా ఆవిష్కరణ చేసారు. తదుపరి కేక్ కట్ చేసి కార్యకర్తలకు మిఠాయిలు పంచారు, పలువురు నాయకులు ఎన్టీఆర్ చేసిన పలు అభివృద్ధి పథకాలను తమ ఉపన్యాసంలో కొనియాడారు టీడీపీ జాతీయ అధ్యక్షులు ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు, లోకేష్ బాబుల నాయకత్వంలో తెలంగాణలో కూడ వచ్చే ఎన్నికలలో కూటమి అధికారంలోకి వస్తుందని నాయకులు ధీమా వ్యక్తం చేసారు. ఈ కార్యక్రమంలో నాయకులు మల్లెంపాటి అప్పారావు, గుడిపూడి వెంకటేశ్వరరావు, మందడపు సుధాకర్, వనమా వాసు, నాగార్జున శ్రీనివాస్, బోయిన వెంకన్న, రాయల కోటేశ్వరరావు, మందపల్లి కోటేశ్వరరావు, పాలడుగు క్రిష్ణ ప్రసాద్, కొలికొండ మురళి, నల్లమాస మల్లయ్య, మల్లెంపాటి లహరిన్ , కర్ణాటి అశ్వనీకుమార్, రాజ రాజేశ్వరి, కామ అనిత, చావా రామారావు, సామినేని లక్ష్మణ్ రావు, వాసిరెడ్డి భాస్కర్ రావు, చల్లంగుడ్ల రమేష్, మేకల సత్యవతి, తాడిశెట్టి స్వాతి, జాన్సీ, తిగుళ్ల రమణ, నల్లమోతు సత్యనారాయణ, అబ్దుల్ మజీద్, మంద వెంకటేశ్వర్లు, ఓర్సు కృష్ణ, జైరాం, లింగయ్య, పొదిల భూపతి, బుడిగే శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

# కలెక్టర్ ఆదేశాలతో బి.వి.ఆర్ స్టోన్ క్రషర్ తనిఖీ



**ముదిగొండ మే 28 మహా:** మండల పరిధిలోని పండ్రేగుపల్లి గ్రామ రెవిన్యూలో గల బి.వి.ఆర్ స్టోన్ క్రషర్ ను జిల్లా కలెక్టర్ ముజామ్మిల్ ఖాన్ ఆదేశాల మేరకు ఆర్డీవో నరసింహారావు బుధవారం తనిఖీ చేశారు. మండల పరిధిలో ఖానాపురం గ్రామానికి చెందిన గ్రామస్తులు కొందరు క్రషర్ కు ఎటువంటి పర్మిషన్ లేకుండా నడుపుతున్నారంటూ కలెక్టర్ కి ఫిర్యాదు చేశారు. స్పందించిన కలెక్టర్ ముజామ్మిల్ ఖాన్ వెంటనే క్రషర్ కు సంబంధించిన విషయాలపై ఉన్నతాధికారులకు ఆదేశాలు ఇవ్వటంతో ఆర్డీవో నరసింహారావు తాహసిల్దార్ సునీత ఎలిజబెత్ తో కలిసి బి.వి. ఆర్ క్రషర్ కి వెళ్లి క్రషర్లుకి కావాల్సిన ప్రభుత్వం నుంచి పొందిన అనుమతి పత్రాలను పరిశీలించారు. అనంతరం ఖానాపురం గ్రామస్తులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ఆర్డీవో వెంట ఆర్ఐ లు ప్రసన్నకుమార్, వాహిదా, వీఆర్ఏ నాగులు మీరా తదితరులు ఉన్నారు.

# కాలువ పనులకు వేగం పెంచండి

## నగరంలో మున్సిపల్ కమిషనర్ పర్యటన



**ఖమ్మం, మహా :** ఖమ్మం నగర అభివృద్ధిలో భాగంగా మున్సిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్య బుధవారం 10వ డివిజన్‌ను సందర్శించారు. ఐటి హబ్ సమీపంలో నిర్మాణంలో ఉన్న ప్రధాన కాలువ పనులను ఆయన స్వయంగా పరిశీలించారు. కాలువ యొక్క వెడల్పు, లోతు తదితర వివరాలు పరిశీలించిన కమిషనర్, పనుల్లో జాప్యం లేకుండా వేగంగా పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. నీటి ప్రవాహానికి ఎలాంటి ఆటంకం లేకుండా తక్కువ సమయంలో పనులు ముగించేందుకు చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. విద్యుత్ స్తంభాలు, ఇతర అడ్డంకులను తొలగించి నిర్మాణానికి సహకరించేలా చూసుకోవాలని సూచించారు. ఎక్కడా నీరు నిలుచకుండా, నిరంతరంగా ప్రవహించేలా కాలువ నిర్మాణం జరగాలని స్పష్టం చేశారు. ఈ సందర్భనలో సంబంధిత డివిజన్ కార్పొరేటర్, ఇంజినీరింగ్ శాఖ అధికారులు పాల్గొన్నారు. కమిషనర్ ఆదేశాల నేపథ్యంలో పనుల వేగం పెరిగే అవకాశం కనిపిస్తోంది.



# కూతురు పుట్టిన ఇల్లు కళకళలాడుతూ ఉంటుంది

- తల్లిదండ్రుల ఆలోచనల్లో మార్పు వస్తేనే అడపిల్లలకు సమానత్వం
- పురుషులతో పోటీపడుతూ ప్రతి రంగంలో మహిళలు ముందంజలో నిలుస్తున్నారు
- జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్





**ఖమ్మం, మహా :** సామాజికంగా తల్లి దండ్రుల ఆలోచనల్లో మార్పు వస్తేనే అడపిల్లలకు సమానత్వం లభిస్తుం దని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. ఆడపిల్లలు పుట్టడం అదృ ష్టమని తెలుపుతూ, ప్రతి బుధవారం జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తున్న మా పాప మా ఇంటి మణిదీపం కార్య క్రమంలో భాగంగా ఖమ్మం నగరం 51వ డివిజన్ ద్వారకనగర్ లో బేగం కుటుంబ సభ్యులు, అంగన్వాడి టీచర్లు, ఆశా కార్యకర్తలు అందంగా ఇంటిని ఆలంకరించి ఆడపిల్లలను పుట్టనిద్దాం.. ఆడపిల్లలను పెరగనిద్దాం.. అమ్మాయిలు ఐపీఎస్, ఐఎఎస్, పోలీస్, డాక్టర్, టీచర్, లాయర్, సైంటిస్ట్, పైలెట్ పలు రంగాల్లో ఉన్నతంగా రాణించాలనే నినాదాలతో ముగ్గులు వేసి కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ కు ఘన స్వాగతం పలికారు. షాజీదాబేగం అఖీల్ దంపతులకు 12 ఫిబ్రవరి, 2025న ఆడపిల్ల పుట్టిన విషయం తెలిసి, వారి ఇంటికి వచ్చిన జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ పాప తల్లిదండ్రులతో పాటు నాన్నమ్మ, పెద్దనాన్న, పెద్దమ్మ బంధువులను కలిసి స్వీట్ బాక్స్, ఫ్రూట్స్, నూతన దుస్తులు, సర్టిఫికెట్ అందించి శుభాకాంక్షలు తెలిపి శాలువాలతో సన్మానించారు. చేతులతో పాపను ఎత్తుకొని రంగు రంగుల పూలతో ముస్తాబు చేసిన ఊయలలో వేసి పాప చిరునవ్వుకు కలెక్టర్ మురిసిపోయారు. సమాజానికి ఆడపిల్లల ఆవశ్యకత ఏలాంటిదో వివరించారు. జిల్లా వ్యాప్తంగా ఆధికారులు ఈ కార్యక్రమంలో ఆడబిడ్డలను ఆశీర్వదించడం చూస్తుంటే సంతృప్తి కలుగుతుందని ఆనందం వెలిబుచ్చారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ, సమాజంలో మహిళలు విద్యా, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో ముందుంటున్నారని, ఆడపిల్లలను బాధ్యతగా పెంచి పోషించి బంగారు భవిష్యత్‌ను కల్పించాలని కోరారు. ఆడబిడ్డ పుట్టిన తల్లిదండ్రులు అదృష్టవంతులు అని అన్నారు. అమ్మాయిలను మగవారితో పమానంగా విద్య, వైద్యం, న్యాయం, సంరక్షణ, సామాజిక ఎదుగుదలకు అవకాశాలు కల్పించాలని సూచించారు. ఆడపిల్లలే ఇంటికి మణి దీపాలు ప్రస్తుత ఆధునిక యుగంలో అన్ని రంగాలలో పురుషులతో సమానంగా పోటీపడుతూ దూసుకెళ్తున్న మహిళలు ఏ రంగంలో తక్కువ కాదు అని నిరూపిస్తున్నారని అన్నారు. కుటుంబ వ్యవస్థలో, సమాజం అత్యాధునిక అభివద్ది పదంలో కొనసాగటానికి ప్రధాన భూమిక మహిళలదే అని, మహిళలను బాల్యం నుండే ప్రోత్సహించి దేశ అభ్యున్నతికి అందరూ కషి చేయాలని తెలియజేశారు. అమ్మాయిలు గొప్ప స్థానంలో ఎదిగేందుకు ఎవరికి తక్కువ కాకుండా పెంచాలని, మనం ఆశించే మార్పు మన ఇంటి నుండే ప్రారంభించాలని, ఆడబిడ్డ కుటుంబానికి అమ్మగా ఉంటుందని, అన్ని బంధాలకు మాతృప్రేమ పంచేవారని అన్నారు. సమాజంలో అమ్మాయి పుడితే మనకు అమ్మ పుట్టినట్లు భావించాలని కలెక్టర్ సూచించారు. మహిళా శిశు సంక్షేమం కోసం ప్రభుత్వాలు అనేక చర్యలు తీసుకోవడం జరుగుతుందని, జిల్లాలో ఏ ఇంట్లో ఆడపిల్ల పుట్టినా జిల్లా అధికారులు వెళ్లి తల్లిదండ్రులకు స్వీట్ బాక్స్ ఇచ్చి, మంచి సందేశం అందించాలని, మహాలక్ష్మి ఇంట్లో పుట్టినందుకు శుభాకాంక్షలు తెలిపాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించామని కలెక్టర్ తెలిపారు. అనంతరం పాప తల్లిదండ్రులు మాట్లాడుతూ, మా ఇంటికి కలెక్టర్ వచ్చి మా పాపకు ఆశీస్సులు అందించి, పాప భవిష్యత్తు గురించి చెప్పడం ఎంతో సంతోషంగా ఉందని, కలెక్టర్ చెప్పిన విధంగా మా పాపను మంచిగా చదివించి ఉన్నత స్థాయిలో ఉండే విధంగా తీర్చిదిదుతామని, పాప పెద్దయిన తర్వాత ఇంటికి కలెక్టర్ గారే స్వయంగా వచ్చి దీవించి వెళ్లారని తెలిపి ఈ నాటి మధుర క్షణాలను పంచుకుంటామని తెలిపారు.ఈ కార్యక్రమంలో సిడిపివో బి. వీరభద్రమ్మ, సూపర్వైజర్ విజయలక్ష్మి, ఆశా కార్యకర్తలు, అంగన్వాడి టీచర్లు, సిబ్బంది, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి మండల కేంద్రంలో దివ్యాంగ మహిళలచే "షీ రాక్స్" సెంటర్ల ఏర్పాటు



**రఘునాథపాలెం, మహా :** ప్రతి మండల కేంద్రంలో దివ్యాంగ మహిళలచే షీ రాక్స్ సెంటర్ ఏర్పాటు చేస్తామని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. బుధవారం రఘునాథపాలెం మండల తహసిల్దార్ కార్యాలయ ఆవరణలో ఇందిరా మహిళా శక్తి పథకం లో మహిళల అర్ధిక ఉన్నతిని కాంక్షిస్తూ గార్లపాటి రమాబాయి కి మంజూరైన షీ రాక్స్ సెంటర్ ను జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ మహిళలకు ఆర్థిక భద్రత కల్పిస్తూ, దివ్యాంగులకు ఉపాధి కల్పించేలా షీ రాక్స్ పేరిట ప్రభుత్వ కార్యాలయాల వద్ద కంప్యూటర్ తో కూడిన జిరాక్స్ సెంటర్ల ఏర్పాటుకు నిర్ణయం తీసుకున్నామని, ఇందులో భాగంగా రఘునాథ పాలెం మండలం తహసిల్దార్ కార్యాలయం వద్ద షీ రాక్స్ సెంటర్ ప్రారంభించడం సంతోషంగా ఉందని అన్నారు. తహసిల్దార్, ఎంపిడిఓ కార్యాలయాల వద్ద జిరాక్స్ షాపు కు మంచి డిమాండ్ ఉందని, దివ్యాంగులకు సౌకర్యవంతంగా ఉపాధి పొందే అవకాశం ఉందని అన్నారు. సిటిజన్ సర్వీస్ సెంటర్, స్కానింగ్, నామినేషన్ వంటి సౌకర్యాలతో భవిష్యత్తులో విస్తరణకు కూడా అవకాశం ఉంటుందని అన్నారు. సిటిజన్ సర్వీస్ సెంటర్, జిరాక్స్ షాపులను ఇందిరా మహిళా శక్తి కార్యక్రమం క్రింద దివ్యాంగులైన మహిళలకు ప్రతి మండల కేంద్రంలో తహసిల్దార్, ఎంపిడిఓ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు. జిల్లాలో ముందుగా దివ్యాంగులకు కేటాయించి జిరాక్స్ కేంద్రాలు ప్రారంభిస్తామని, అనంతరం దశల వారీగా మహిళలకు జన సంచారం అధికంగా ఉండే ప్రాంతాలలో షీ రాక్స్ సెంటర్ లను కేటాయిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో డి ఆర్డీవో సన్యాసయ్య, రఘునాథ పాలెం మండల తహసీల్దార్ శ్వేత, అధికారులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలలో నమోదును పెంచాలి

- రాష్ట్ర వ్యాప్తంగా నర్సరీ పాఠశాలలు విద్యను అమలు చేయాలి
- టిఎస్ యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు షేక్ రంజాన్



**కూసుమంచి, మే 28, మహా :** తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి నాణ్యమైన విద్యను పొందాలని, ప్రభుత్వ బడులను కాపాడుకోవాలని టిఎస్ యుటిఎఫ్ అధ్యక్షులు శ్రీ షేక్ రంజాన్ పిలుపునిచ్చారు. సోమవారం నాడు ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లల నమోదు పెంపుదల కొరకు టీఎస్ యుటిఎఫ్ జిల్లా కమిటీ ప్రచార జాతను ప్రారంభించారు అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో సుశిక్షితులైన ఉపాధ్యాయులు ఉన్నారని, విశాలమైన తరగతి గదులు , ఆటస్థలం ఉన్నాయని తల్లిదండ్రులందరూ తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి నాణ్యమైన విద్యను ఉచితంగా పొందాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ బడులను కాపాడాల్సిన బాధ్యత తల్లిదండ్రుల పైన ఉన్నదని తెలియజేశారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు,నోటు పుస్తకాలు, వర్క్ బుక్కులు, ఏకరూప దుస్తులు ఉచితంగా అందించబడుతున్నాయని, నాణ్యమైన మధ్యాహ్న భోజనం, వారానికి మూడు సార్లు కోడిగుడ్లు, రాగిజావ అందిస్తున్నారని తల్లిదండ్రులు ప్రభుత్వ పాఠశాలలను ఆదరించి పిల్లలను చేర్పించి, ఫీజుల భారం లేని ఉచిత విద్య పొందాలని, విద్యార్థుల సమగ్ర వికాసానికి ప్రభుత్వ పాఠశాలలు దోహదపడుతాయని తెలియజేశారు. గుడి, మసీదు,చర్చిల నిర్మాణం కోసం ఐకమత్యంగా కదిలే ప్రజలు ఊరి బడి కోసం కూడా ఏకమై బడిని నిలబెట్టుకోవాల్సిన బాధ్యత ఉందని తెలియజేశారు. గ్రామాలలో ప్రతి ఇంటికి వెళ్ళి ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించాలని టీఎస్ యుటిఎఫ్ శ్రేణులు ఈరోజు నుండి పది రోజులు పాటు ప్రచారం నిర్వహిస్తాయని తెలియజేశారు. ఆంగ్ల మాధ్యమంలో విద్యా బోధన, ఉచిత ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తారని, అత్యున్నత విద్యార్హతలు కలిగిన టీచర్లు ఉంటారని తల్లిదండ్రులకు వివరిస్తామని తెలియజేశారు. తల్లిదండ్రుల ఆశను ప్రైవేటు విద్యా వ్యాపారులు సొమ్ము చేసుకుంటున్నారని, చదువుల నాణ్యతలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల మధ్య పెద్దగా వ్యత్యాసం లేదని పలు సర్వేలు వెల్లడిస్తున్నాయని, సంపాదనలో సగానికి పైగా పిల్లల చదువుల కోసమే ఖర్చు చేయాల్సిన దుస్థితి ఏర్పడిందని, ప్రభుత్వ బడి మూతపడితే సమాజానికి నష్టం అని, మన ఊరు మనబడి, అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీల ద్వారా మౌళిక వసతుల కల్పన మెరుగైందని తెలియజేశారు. ప్రాథమిక పాఠశాలల్లో పూర్వ ప్రాథమిక తరగతులను ప్రారంభించటానికి ప్రభుత్వం సన్నాహాలు చేస్తోందని, ఏఐ ఆధారిత బోధన, డిజిటల్ తరగతి గదులు, లైబ్రరీ, లేబరేటరీలతో పాటు ఆటపాటలతో అహ్లాదకరమైన వాతావరణంలో, ప్రతి విద్యార్థి పట్ల వ్యక్తిగత శ్రద్ధతో, నిపుణులైన ఉపాధ్యాయులతో ఒత్తిడి లేని చదువు అందించబడుతుందని, పిల్లల మానసిక ఆరోగ్యానికి, వ్యక్తిత్వ వికాసానికి అనువుగా ప్రభుత్వ పాఠశాలలు రూపుదిద్దుకుంటున్నాయని, మన పిల్లలను మన ఊరి బడిలోనే చేర్పించి బడికి అవసరమైన వసతుల కల్పనకు ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తే తప్పనిసరిగా బడి నిలబడుతుందని తెలియజేశారు. పిల్లలకు నాణ్యమైన విద్య ఉచితంగా అందుతుంది. తల్లిదండ్రులకు ఫీజుల భారం తగ్గుతుంది. కనుక తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి వారి భవిష్యత్తుకు భరోసా ఇవ్వాలని పిలుపునిచ్చారు. ఏరియాలలో తొలిరోజు ప్రచారం నిర్వహించారు. ఈ ప్రచార జాతాలో పీఎస్ యూటీఎఫ్ ఖమ్మం జిల్లా అధ్యక్షులు షేక్. రంజాన్ గారు, జిల్లా కార్యదర్శులు మండవ. నర్సయ్య, షేర్. ఉద్దండ్ షరీఫ్, తిరుమలాయపాలెం అధ్యక్షులు కేశ్య, సతీష్, రాంబాబు, రంగమ్మ,సిరంజిత తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వం నకిలీ విత్తనాలు అరికట్టాలి




**వైరా మహా :**మార్కెట్ లో, గ్రామాల్లో మధ్య దళారులు నకిలీ విత్తనాలు రైతులను నమ్మించి అమ్మే ప్రయత్నం చేస్తే వారిని రాష్ట్ర ప్రభుత్వం, వ్యవసాయ శాఖ అధికారులు కఠినంగా శిక్షించాలని, నకిలీ విత్తనాలు అరికట్టే విధంగా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని సిపిఐ(ఎం) వైరా డివిజన్ కార్యదర్శి భూక్యా వీరభద్రం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం సిపిఐ(ఎం) వైరా డివిజన్ కార్యాలయం బోడెపూడి భవనంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు సుంకర సుధాకర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో భూక్యా వీరభద్రం మాట్లాడుతూ వైరా కేంద్రంగా, అదేవిధంగా నియోజకవర్గంలోని గిరిజన ప్రాంతాల్లో నకిలీ విత్తనాల బెడదతో గతంలో రైతులు తీవ్రంగా నష్టపోయారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం రైతులకు అన్ని రకాల నాణ్యమైన విత్తనాలు సబ్సిడీపై అందించాలని ఆయన డిమాండ్ చేశారు. వ్యవసాయ శాఖ అధికారులు అన్ని గ్రామాలు, ప్రాంతాల్లో పర్యవేక్షణ చేసి నకిలీ విత్తనాలు రైతులకు చేరకుండా మధ్య దళారులను గుర్తించి చర్యలు చేపట్టాలని కోరారు. ప్రభుత్వం వ్యవసాయ సీజన్ ప్రారంభమైంది కాబట్టి నాలుగు ఎకరాల పైబడిన రైతులకు రుణమాఫీ డబ్బులు వెంటనే అందించాలని కోరారు. మే 30వ తేదీన ఉపాధి కూలీలకు రావాల్సిన పెండింగ్ బిల్లుల సమస్యపై కలెక్టరేట్ వద్ద జరుగు ధర్నాకు ఉపాధి కూలీలు అందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో సిపిఐ(ఎం) వైరా పట్టణ కార్యదర్శి చింతనిప్పు చలపతిరావు, వైరా రూరల్ మండల కార్యదర్శి బాణాల శ్రీనివాసరావు, డివిజన్ కమిటీ సభ్యులు తోట నాగేశ్వరావు పాల్గొన్నారు.

# పేదల సమస్యలపై 30న కలెక్టరేట్ ఎదుట ధర్నా

**నేలకొండపల్లి, మే 28 మహా:**పేదలు, వ్యవసాయ కూలీలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 30న జిల్లా కలెక్టరేట్ ఎదుట చేపట్టిన ధర్నాను జయప్రదం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కె.వి. రామిరెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం మండలంలోని బోదులబడ గ్రామంలో డంపింగ్ యార్డ్ వద్ద పనులు చేస్తున్న ఉపాధి హామీ కూలీలను కలిసి సమస్యలపై వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనేక పోరాటాల ఫలితంగా కమ్యూనిస్టు పార్టీల సహకారంతో కేంద్రంలోని గత యూపీఏ ప్రభుత్వం తీసుకొచ్చిన జాతీయ ఉపాధి హామీ చట్టాన్ని ప్రస్తుత బిజెపి ప్రభుత్వం నిర్వీర్యం చేస్తుందని మండిపడ్డారు. వ్యవసాయ కూలీలకు పని దినాలు తగ్గించడంతోపాటు రోజు వారి కూలీని కూడా నామమాత్రంగా ఇస్తుండడంతో వ్యవసాయ కూలీలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఉపాధి కూలీలకు పని భద్రత భరోసాగా ఉన్న జాతీయ ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేసే బిజెపి ప్రభుత్వ కుట్రలను తిప్పి కొట్టాలన్నారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. భూమిలేని నిరుపేదలందరికీ 12 వేల ఆర్థిక సహాయం, పెంచిన నాలుగువేల పింఛను అమలు చేయాలని, వ్యవసాయ కూలీలకు రోజు కూలి 600 రూపాయలు చెల్లించాలని, పని ప్రదేశంలో కూలీలకు కనీస సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేస్తూ కలెక్టరేట్ వద్ద చేపట్టిన ధర్నాలో వేలాదిమంది పేదలు, వ్యవసాయ కూలీలు పాల్గొనేలా గత అనేక రోజులుగా వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వేలాదిమంది పేదలు, వ్యవసాయ కూలీలను ధర్నాకు తరలించి పాలక ప్రభుత్వాల మెడలు వంచి రానున్న కాలంలో సమస్యలు సాధించుకుందామన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధిహామీ మేట్లు గడ్డం భాగ్యలక్ష్మి, కుమారి, ఎడవల్లి సైదమ్మ, శ్రీను, యశోద, వెంకటలక్ష్మి, పొట్ట పెంజర వాణి, మరియమ్మ, యేసు, తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం శరవేగంగా పూర్తి చేయాలి




**నెలకొండపల్లి, మే 28 మహా:** నేలకొండపల్లి మండలం లోని రాజేశ్వరపురం రైతు వేదికలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ చైర్మన్ వెన్నుపూసల సీతారాములు మాట్లాడుతు ..ఈ సందర్భంగా నేలకొండపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ వెన్నుపూసల సీతారాములు మాట్లాడుతూ, "ఇందిరమ్మ ఇల్లు లబ్ధిదారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అధికారులు సమర్థవంతంగా చర్యలు తీసుకున్నారు. మా మండలానికి అదనంగా ఇళ్ల మంజూరులో రెవెన్యూ శాఖ మంత్రి శ్రీ పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సహకారం విలువైనది. ఆయనకు మండల ప్రజల తరపున ప్రత్యేక అభినందనలు తెలియజేస్తున్నాం," అని తెలిపారు. అలాగే, "ఇందిరమ్మ ప్రభుత్వంలో రైతులకు అన్ని విధాలుగా మద్దతు లభిస్తోంది. రైతులందరికీ త్వరలోనే బోనస్ అందుతుంది. ప్రభుత్వం వారిని అన్ని విధాలా రక్షిస్తూ ముందుకు తీసుకెళ్తోంది," అని ఆయన పేర్కొన్నారు.లబ్ధిదారులు కూడా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటున్నారని, గ్రామీణ ప్రాంతాల్లో నిరుపేదల కలను నిజం చేస్తూ ఇందిరమ్మ ప్రభుత్వ పథకం ముందుకు సాగుతోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో శాఖమూరి రమేష్ , కొడాలి గోవిందరావు,మాజీ సర్పంచ్ లు పెంటమళ్ల పుల్లమ్మ, కొమ్మినేని విజయ్ బాబు, వడ్లమూడి నరసయ్య, అధికారులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఆడపిల్ల ప్రతి ఇంటి మణిదీపం



**నేలకొండపల్లి, మే 28 మహా:** బాలికల సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని తిరుమలయపాలెం ఐసిడిఎస్ ఎ సి డి పి ఓ రత్న కుమారి అన్నారు.. మాఇంటి మణిదీపం కార్యక్రమం నిర్వహించారు.అందులో భాగంగా నేలకొండపల్లి మండలం లోని మోటపురం లో ఇటీవల ఆడపిల్లకు జన్మనిచ్చిన తల్లిదండ్రులు నాగలక్ష్మిసురేష్ ఇంటికి అధికారులు వెళ్లి వారిని అభినందించారు. అనంతరం వారిని ఘనంగా సన్మానించి స్వీట్లు, పండ్లు అందజేసి చిన్నారి ని ఆశీర్వదించారు.ఈసందర్భంగా ACDPO రత్నకుమారి మాట్లాడుతూ అమ్మాయిలు పుడితే భారం అని అనేక కుటుంబాలు భావిస్తున్నాయని మగపిల్లలతో సమానంగా ఆడపిల్లలను పెంచాలని ఆయన అన్నారు.ఆడపిల్లలు మగ వారితో సమానంగా అన్ని రంగాల్లో ముందుకు పోతున్నారని ఆయన తెలిపారు. ఆడపిల్ల ఇంటికి లక్ష్మీదేవి అని వారిని సంరక్షించుకోవాల్సిన బాధ్యత అందరి పైన ఉందని ఆయన పేర్కొన్నారు.ప్రతి ఇంట్లో ఒక ఆడపిల్ల ఉండాలని వారిపై వివక్షను రూపుమాపాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ లక్ష్మి కుమారి తదితరులు పాల్గొన్నారు.

## సైబర్ నేరస్తుడును అరెస్టు చేసిన సైబర్ క్రైమ్ పోలీసులు



**ఖమ్మం, మహా.** ఆన్లైన్ లో ట్రేడింగ్ , ఇన్వెస్ట్మెంట్ లో డబ్బులు పెడితే ఎక్కువ లాభాలు వస్తాయని నమ్మించి, సుమారు 1.62 కోట్ల రూపాయలు మోసం చేసిన కేసులో మరోకరిని ఖమ్మం సైబర్ క్రైమ్ పోలీసులు సిద్దిపేట లో అరెస్టు చేసినట్లు ఖమ్మం పోలీస్ కమిషనర్ సునిల్ దత్ తెలిపారు. కేసు వివరాలలోకి వెళితే ఖమ్మం జిల్లాలోని బోనకల్ మండలానికి చెందిన సాఫ్ట్వేర్ ఇంజనీర్ కి ఫోన్ చేసి ఆన్లైన్ లో ట్రేడింగ్ మరియు ఇన్వెస్ట్మెంట్ చేస్తే అధిక లాభాలు వస్తాయని ఆశచూపి వాట్సప్ మరియు ట్రేడింగ్ లింకుల ద్వారా సుమారు 1.62 కోట్ల రూపాయలు ఇన్వెస్ట్మెంట్ చేసి మోసపోయిన కేసులో గాను 26 తేదీన ముగ్గురు నిందుతుల ను అరెస్ట్ చేసి రిమాండ్ కి తరలించిన నేపద్యంలో 27 న మరొక్క నిందుతుడు అయిన నలువాల అర్జున్, 33 సం. ని గుర్తించి సిద్దిపేట జిల్లాలో అరెస్టు చేసి ఖమ్మం సైబర్ క్రైం కోర్టులో హజరు పరిచి, రిమాండ్ కి తరలించినట్లు తెలిపారు. ఈ కేసుల విచారణలో ముఖ్య పాత్ర వహించిన సైబర్ క్రైం డి.ఎస్పీ సీహెచ్.ఆర్.వి . ఫణిందర్ ని, ఎస్సై లు రంజిత్ కుమార్, విజయ్ కుమార్ మరియు సైబర్ క్రైం పోలీస్ స్టేషన్ సిబ్బందిని ఖమ్మం సి.పి గారు అభినందించారు.

## నాణ్యమైన విత్తనాలు మాత్రమే విక్రయించాలి



**బోనకల్లు, మహా :** నాణ్యమైన విత్తనాలు మాత్రమే రైతులకు విక్రయించాలని నకిలీలు అంటగడితే కేసులు నమోదు చేస్తామని బోనకల్లు ఎస్సై వెంకన్న అన్నారు. పోలీస్ కమిషనర్ సునీల్ దత్ ఆదేశాల మేరకు వైరా ఏసీపీ రహెమాన్ పర్యవేక్షణలో వ్యవసయశాఖ వినయ్, హరికృష్ణ గారితో కలసి మండలంలోని విత్తనాలు & ఎరువుల దుకాణాలలో, గోడౌన్లలో సంయుక్తంగా అకస్మిక తనిఖీలు చేపట్టారు. దుకాణాల్లో ఉన్న విత్తనాల స్టాక్ వివరాలను, ఎరువులు, పురుగు మందులను పరిశీలించారు. అదేవిధంగా విత్తనాలకు సంబంధించిన బిల్లు పుస్తకాలు, డెలివరి చలాన్‌లను, మార్కెటింగ్ అగ్రిమెంట్, వచ్చిన స్టాక్, విత్తనాల విక్రయ రిజిస్టర్, లాట్ రిజిస్టర్, రైతు విక్రయ రిజిస్టర్, లైసెన్స్ సక్రమంగా వున్నాయ లేదా అని పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ... రైతులకు నాణ్యమైన విత్తనాలు అందేలా పకడ్బంది చర్యలు తీసుకోవడం జరుగుతుందని, ఎవరైనా ప్రముఖ బ్రాండెడ్ కంపెనీల విత్తనాల పేరుతో నాసి రకం, నకిలీ విత్తనాలు అంటగట్టి రైతులను మోసం చేయాలని చూస్తే ఉపేక్షించేది లేదన్నారు.రైతులు సైతం విత్తనాలు కొనుగోలు సమయంలో అప్రమత్తత పాటిస్తూ ..కొనుగోలు రశీదు తీసుకోవాలని సూచించారు. డీలర్లు, ఫెర్టిలైజర్ షాపు యజమానులు రైతులకు నకిలీ, కాలం చెల్లిన విత్తనాలు, ఎరువులు, నిషేధిత పురుగు మందులు విక్రయిచవద్దని, రైతులకు నష్టం కలిగేలా వ్యవహారించవద్దని అన్నారు. మార్కెట్ లో నకిలీ విత్తనాల విక్రయం జరుగకుండా టాస్క్ ఫోర్స్ బృందాల నిరంతరం పర్యవేక్షణ వుంటుందని తెలిపారు. కొంతమంది దళారులు ముఠాలుగా ఏర్పడి, తక్కువ డబ్బుకు విత్తనాలు ఇస్తామని ఆశ చూపి రైతులను మోసం చేస్తారని, ఇటువంటి వారిపై గ్రామాల్లో సైతం నిఘా పెట్టామని తెలిపారు. నకిలీ విత్తనాలు అమ్మినట్లు తెలిస్తే వెంటనే మండల వ్యవసాయ శాఖ అధికారికి గాని స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు.

# ప్రభుత్వ ఆసుపత్రిలో కలెక్టర్ జితేష్ వి పాటిల్ సతీమణికి ప్రసవం

- పండంటి మగ బిడ్డకు జన్మనిచ్చిన కలెక్టర్ సతీమణి శ్రద్ధ జితేష్ వి పాటిల్
- సామాన్య ప్రజలకు ఆదర్శంగా నిలవడంతో శుభాకాంక్షలు తెలిపిన జిల్లా ప్రజానీకం





**భద్రాద్రి కొత్తగూడెం, మే 28 (మహా):** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ ప్రభుత్వ ఆసుపత్రిలో జిల్లా కలెక్టర్ సతీమణికి అక్కడి వైద్యులు సాధారణ కాన్పు నిర్వహించడంతో కలెక్టర్ జితేష్ వి పాటిల్ సతీమణి శ్రద్ధ జీతేష్ వి పాటిల్ బుధవారం పండంటి మగబిడ్డకు జన్మనిచ్చారు. సమాజంలో అతి సాధారణ స్థితిని అనుభవిస్తున్న ఎవరైనా, చిన్నపాటి ఉద్యోగాలు చేసుకుంటూ కుటుంబాలను పోషించుకుంటున్న వారితోపాటు, స్థితిమంతులు, సంపన్నులు సౌకర్యాలు మంచిగా ఉంటాయనే ఉద్దేశంతో, ప్రసవాల కోసం, కార్పొరేట్, ప్రైవేట్ ఆస్పత్రులను ఆశ్రయించటం మనం చూస్తూ ఉన్నాం. ఇక బీద బిక్కి, మధ్యతరగతి కుటుంబాల వారు, కార్పొరేట్ ప్రైవేట్ ఆస్పత్రుల ఖర్చులను భరించలేక తప్పనిసరి పరిస్థితులలో ప్రభుత్వ వైద్యశాలలను ఆశ్రయిస్తారు. కానీ ఓ జిల్లాకు బాస్ గా వ్యవహరిస్తున్న జిల్లా కలెక్టర్ తన సతీమణి ప్రసవం కోసం ప్రభుత్వ ఆసుపత్రిలోనే జరగాలనే ఉద్దేశంతో, తన సతీమణిని ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించి అక్కడే వైద్యుల పర్యవేక్షణలో ప్రసవం జరిపించడంతో ప్రజలకు ఆదర్శంగా నిలిచారు. జితేష్ వి పాటిల్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్గా బాధ్యతలు స్వీకరించిన తర్వాత, ఎక్కువగా ఫీల్డ్ విజిట్ చేసి క్షేత్రస్థాయిలో జిల్లాను ఆకళింపు చేసుకునేందుకు ఎక్కువ ఆసక్తి చూపించారు. ముఖ్యంగా దట్టమైన అటవీ ప్రాంతాలలో కూడా కలెక్టర్ కాలినడకనే స్వయంగా వెళ్లి అక్కడ స్థితిగతులను తెలుసుకునేవారు. అదేవిధంగా జిల్లాలో గిరిజనులు ఎక్కువగా నివసించే ప్రాంతాలను సందర్శించి, వారిని ఆర్థికంగా పటిష్టపరిచేందుకు, సమాజంలో వారిని కూడా సముచిత స్థానంలో నిలిపేందుకు, టూరిజం పేరుతో అనేక కార్యక్రమాలను జిల్లాకు పరిచయం చేసిన ఘనత కలెక్టర్ జితేష్ వి పాటిల్ దే. అంతేకాకుండా పనికి ఆహార పథకం, తదితర పథకాల అమలు కోసం ఆయనే స్వయంగా పలుగు పారా చేత పట్టి అక్కడ పనిచేస్తున్న కూలీలతో పాటు పనిచేయడం జిల్లా ప్రజలకు విదృతమే. అత్యంత సాధారణంగా అందరితో కలిసిపోయే తత్వం ఉన్న జిల్లా కలెక్టర్ తన భార్య కాన్పు ప్రభుత్వ ఆసుపత్రిలో జరిపించడం, ఆయనకు పండంటి మగ బిడ్డ కలగడంతో జిల్లా ప్రజలు కలెక్టర్కు శుభాకాంక్షలు అందజేస్తున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ జితేష్ వి పాటిల్ ఆసుపత్రిలో మీడియాతో మాట్లాడుతూ, తాను భద్రాద్రి, కొత్తగూడెం జిల్లా కలెక్టర్గా ఉన్న సమయంలో ఇక్కడ ప్రసవం జరిగి తనకు కొడుకు పుట్టడం అదృష్టంగా భావిస్తున్నానని, తనకు చాలా సంతోషంగా ఉందని కలెక్టర్ తెలిపారు. ఇక్కడికి ప్రభుత్వ ఆసుపత్రి సౌకర్యాలు సామాన్య ప్రజలందరికోసమని, పాల్వంచ వైద్య విధాన పరిషత్ ఆసుపత్రిలోని సౌకర్యాలపై ప్రయోగం తన కుటుంబంతోటే మొదలైందని కలెక్టర్ తెలిపారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాంప్రసాద్, డాక్టర్ దొరస్వామి రాజు, డాక్టర్ సరళ, డాక్టర్ అనూష, డాక్టర్ సుజాత నేతృత్వంలో తన భార్యకు కాన్పు జరిగిందని, డి ఎం అండ్ హెచ్ ఓ డాక్టర్ భాస్కర్, డిసిహెచ్ఎస్ డాక్టర్ రవిబాబులు, స్థానిక స్టాఫ్ నర్సులు నర్సింగ్ సిబ్బంది అందరూ కూడా సమన్వయంతో పనిచేసి ప్రభుత్వ ఆసుపత్రులపై ప్రజలకు నమ్మకం కలిగించేలా వ్యవహరించడం సంతోషంగా ఉందని అందరికీ కృతజ్ఞతలు తెలిపారు. తన సతీమణి, చాలకాలంగా పాల్వంచ ప్రభుత్వ ఆసుపత్రి లోనే పరీక్షలు చేయించుకుంటున్నదని కలెక్టర్ తెలిపారు.

# మన ఊరి పిల్లల్ని మన ప్రభుత్వ బడిలో చేర్పిద్దాం

## టీఎస్ యుటిఎఫ్ పిలుపు



**నేలకొండపల్లి, మే 28 మహా:** మన గ్రామంలోని బడి ఈడు పిల్లలందరినీ మన ఊరి ప్రభుత్వ పాఠశాలలో చేర్పించి ప్రభుత్వ బడిని కాపాడుకుందామని తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్ యుటిఎఫ్) అధ్యక్షులు ఎస్.కె రంజాన్ విద్యార్థుల తల్లిదండ్రులకు పిలుపునిచ్చారు. బడి ఈడు పిల్లలందరినీ ప్రభుత్వ బడిలో చేర్పించాలని కోరుతూ టీఎస్ యుటిఎఫ్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన జీవుజాత బుధవారం నేలకొండపల్లి మండలానికి చేరుకుంది. మండలంలోని మండలంలోని రాజేశ్వరపురం, నేలకొండపల్లి, గువ్వలగూడెం, తదితర గ్రామాలలో విస్తృతంగా ప్రచారం చేశారు .ఈ సందర్భంగా ఎస్.కె రంజాన్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో ఇంగ్లీష్ మీడియంలో నాణ్యమైన విద్యా బోధన జరుగుతుందన్నారు. ఉచితంగా పుస్తకాలు, నోట్ పుస్తకాలు, రుచికరమైన మధ్యాహ్నం భోజనం, అన్ని రకాల సౌకర్యాలు, ఆట స్థలాలు, విశాలమైన తరగతి గదులు, మంచి లైబ్రరీ , ఐఎఫ్పి లతోటి డిజిటల్ విద్యా బోధన మంచి వాతావరణంలో ఒత్తిడి లేని చదువులతో ప్రభుత్వ పాఠశాలలో విద్య అందుతుందని తెలిపారు. ప్రజలందరూ కూడా ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులను చేర్పించి ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలని కోరారు. ప్రైవేట్ పాఠశాలలో వేలాది మంది పిల్లల్లో కొద్దిమందిని మాత్రమే చూపించి వాళ్ళ దగ్గరే నాణ్యమైన విద్య అందుతుందని అబద్ధపు ప్రచారం చేస్తూ తల్లిదండ్రుల నుంచి లక్షలాది రూపాయలు ఫీజులు వసూలు చేస్తూ తల్లిదండ్రుల మీద ఆర్థిక భారాన్ని మోపుతున్నారన్నారు. దీనివల్ల కుటుంబాలు ఆర్థికంగా చిన్నాభిన్నమవుతన్నాయన్నారు. పిల్లల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని వారికి నాణ్యమైన విద్యను అందించేందుకు ప్రభుత్వ బడులలో చేర్పించి పిల్లల బంగారు భవిష్యత్తుకు బాటలు వేయాలని కోరారు. ఈ జాతాలో టీఎస్ యుటిఎఫ్ జిల్లా కార్యదర్శులు సురేష్, నరసయ్య, జిల్లా ఆడిట్ కమిటీ సభ్యులు అరవింద్ కుమార్, నేలకొండపల్లి మండల ప్రధాన కార్యదర్శి తోర్తి గురవయ్య, ముదిగొండ అధ్యక్షులు వాసం రాంబాబు, తిరుమలయాపాలెం అధ్యక్షులు కేస్యా తదితరులు పాల్గొన్నారు.

## మహిళా సంఘాల ఉత్పత్తులకు ప్రణాళిక బద్ధంగా

# డిమాండ్ సృష్టించాలి

- రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్ శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు
- జన సంచారం ఉన్న ప్రదేశాలలో మహిళా సంఘాల ఉత్పత్తులను ప్రదర్శించాలి
- నగరంలోని 4 మార్కెట్లలో కూడా మహిళా సంఘాలకు ప్రత్యేక సెంటర్ల ఏర్పాటు
- ఖమ్మం మహిళా మార్ట్ ను ప్రారంభించిన మంత్రి తుమ్మల





**ఖమ్మం, మహా :** మహిళా సంఘాలు తయారు చేసే ఉత్పత్తులకు ప్రణాళిక బద్ధంగా డిమాండ్ సృష్టించాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్ శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వర రావు అన్నారు. బుధవారం మంత్రి, ఖమ్మం నగరంలో 30 లక్షల అంచనా వ్యయంతో ఏర్పాటు చేసిన ఖమ్మం మహిళా మార్ట్ ను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి వర్యులు తుమ్మల నాగేశ్వర రావు మాట్లాడుతూ మహిళా సంఘాలు తయారు చేసిన పరికరాలు, వస్తువుల విక్రయం కూడా వారి ద్వారానే జరగాలని పట్టుదలతో జిల్లా కలెక్టర్, మహిళా మార్ట్ ను ఏర్పాటు చేశారని తెలిపారు. దళారులకు లాభం వెళ్లకుండా మహిళా సంఘాలు లాభ పడాలనే ఆకాంక్షతో ప్రభుత్వం మహిళా మార్ట్ ఏర్పాటు చేసిందని అన్నారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత సీఎం రేవంత్ రెడ్డి మహిళా సంఘాలు తయారు చేసే వస్తువులను విక్రయించేందుకు హైదరాబాదులోని శిల్ప కళారామం వేదికలో అవకాశం కల్పించారని తెలిపారు. అదే విధంగా ఖమ్మం నగరంలో ప్రయోగాత్మకంగా ఖమ్మం మార్ట్ ఏర్పాటు చేసామని తెలిపారు. ఖమ్మం నగరంలో నాలుగు వైపులా ఉన్న నాలుగు మార్కెట్లలో కూడా మహిళా సంఘాల కోసం ప్రత్యేకంగా మార్ట్ లాంటి సౌకర్యాలను కల్పించాలని అన్నారు. ముదిగొండ మహిళలు బ్యాగులు తయారు చేశారని, బ్రాండెడ్ షాపుల కంటే చాలా బాగా ఉన్నాయని అన్నారు. మనం తయారు చేసిన వస్తువుకు వ్యాపారం జరగాలంటే అన్ని చోట్ల ప్రదర్శనలు చేయాలని మంత్రి సూచించారు. బస్ స్టాండ్, రైల్వే స్టేషన్ వంటి జనసంచారం అధికంగా ఉన్న ప్రాంతాల్లో కూడా చిన్న, చిన్న స్టాల్స్ వంటివి ఏర్పాటు చేసుకోవాలని మంత్రి సూచించారు. మహిళా సంఘాలు తయారు చేసిన వస్తువులు మన ప్రజలు వాడుకునేలా తయారు కావాలని అన్నారు. మన వస్తువులు పక్క దేశాలకు ఎగుమతి చేసే స్థాయికి ఎదగాలని మంత్రి తెలిపారు. మన పిల్లలు బాగా చదువుకుంటేనే పేదరికం నుంచి బయటకు వస్తామని, పిల్లలను లింగ బేదం లేకుండా ఉన్నత చదువులు చదివించాలని మంత్రి సూచించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ మహిళలను ప్రత్యేకంగా ఆర్థికంగా బలోపేతం చేసేందుకు ప్రభుత్వం ఇందిరా మహిళా శక్తి కార్యక్రమాన్ని అమలు చేస్తుందని, ఇందులో భాగంగా మన ఖమ్మం జిల్లాలో ప్రత్యేకంగా టీ స్టాల్, షీ రాక్స్ సెంటర్, మహిళలకు లాభం కలిగేలా అనేక కార్యక్రమాలను ప్రత్యేకంగా అమలు చేస్తున్నామని కలెక్టర్ తెలిపారు. జిల్లాలో మహిళా సంఘాలు ఉత్పత్తి చేసే 20 రకాల వస్తువులు మన జిల్లా బ్రాండింగ్ తో ఏర్పాటు చేశామని అన్నారు. మన జిల్లా వాసుల కోసం మన మహిళా సంఘాలు తయారు చేసే ఉత్పత్తులు ఖమ్మం మహిళా మార్ట్ లో ఎటువంటి కల్తీ లేకుండా పూర్తి నాణ్యతతో కూడిన పదార్థాలు అందుబాటులో ఉంటాయని అన్నారు. మహిళా మార్ట్ ఆవరణలో ఏర్పాటు చేసిన టీ స్టాల్ ను మంత్రి ప్రారంభించి, టీ త్రాగారు. అనంతరం మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రకాష్ నగర్ 29వ డివిజన్ లో టి.యూ.ఎఫ్.ఐ.డి.సి నిధులు 60 లక్షల రూపాయలతో చేపట్టిన సిసి రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసి పనులు నాణ్యతతో పది కాలాలపాటు ఉండేలా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, మేయర్ పూనుకొల్లు నీరజ, మునిసిపల్ కమీషనర్ అభిషేక్ అగస్త్య, మార్కెట్ కమిటీ చైర్మన్, డి.ఆర్.డి.ఓ. సన్యాసయ్య, ఆర్డీఓ నరసింహారావు, పంచాయతీ రాజ్ ఎస్ఇ వెంకట్ రెడ్డి, సంబంధిత శాఖల అధికారులు, కార్పొరేటర్లు, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

## రైతు సంక్షేమంలో రాజీ లేదు

- రైతు బంధును మరిపిస్తున్న వరి బోనస్
- ఉద్యోగ మేళతో నిరుద్యోగలలో అనందం
- పచ్చిరొట్ట విత్తనాలు పంపిణీ చేసిన వైరా ఎమ్మెల్యే



**కారేపల్లి, మహా :** రైతు సంక్షేమం విషయంలో తెలంగాణ ప్రభుత్వం రాజీ లేకుండా పని చేస్తుందని వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్‌నాయక్ అన్నారు. బుధవారం కారేపల్లి సోసైటీ కార్యాలయంలో పచ్చిరొట్టవిత్తనాల పంపిణి కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈసందర్భంగా సోసైటీ చైర్మన్ దుగ్గినేని శ్రీనివాసరావు ఆధ్యక్షతన జరిగిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతు పండిరచిన వరి ధాన్యానికి ఇస్తున్న బోనస్, రైతుభరోసా పెట్టుబడి పథకాన్ని మరిపిస్తుందన్నారు. ఖరీఫ్ సీజన్‌లో కారేపల్లి మండలంలో 289 మంది రైతులకు రూ.73.60 లక్షల వరి బోనస్ రూ.500 వారి ఖాతాలలో జమ చేయటం జరిగిందన్నారు. రభీ సీజన్‌లో సైతం బోనస్ జమ కార్యక్రమం నడుస్తుందన్నారు. మండలంలో 5249 మంది రైతులకు రూ.46.19 కోట్లు రుణమాఫీ జరిగిందన్నారు. రైతు భరోసా క్రింద ఇప్పచి వరకు 1500 మంది రైతులకు గాను రూ. 12.78 కోట్లు జమ అయ్యాయని తెలిపారు. రాష్ట్రం ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న రైతు సంక్షేమ విషయంలో రాజీ లేకుండా పని చేస్తుందన్నారు. వైరాలో నిర్వహించిన ఉద్యోగ మేళతో నిరుద్యోగుల కండ్లలో అనందం తనకు సంతృప్తినిచ్చిందన్నారు. ఉద్యోగ మేళాకు 12వేల మంది హాజరుకాగా 4050 మందికి రూ.15 వేల నుండి రూ.60 వేల జీతభత్యాలు గల ఉద్యోగాలు ఇప్పించటం జరిగిందన్నారు. ఏడాదిన్నర పాలనలో ప్రతి ఇంటికి సంక్షేమ ఫలాలు ఇవ్వటమే లక్ష్యంగా పని చేసినట్లు తెలిపారు. పథకాలు రాని వారు నిరుత్సహ పడాల్సి అవసరం లేదని వారికి కూడా పథకాలు ఫలాలు అందిస్తామని హామీ ఇచ్చారు. రసాయన ఎరువుల వాడకంతో వాతావరణ పరంగానే కాక మానవ ఆరోగ్యపరంగా ఎన్నో అనార్థాలు ఉన్నాయన్నారు. రసాయన ఎరువు వాడకం తగ్గించి దానికి సమానమైన జీవరాసాయన ఎరువులను ఉత్పత్తి చేసే జిలుగు, జనుము, పెసర వంటి పచ్చిరొట్ట ను సాగు చేయాలన్నారు. పచ్చి రొట్ట ఎరువును ప్రోత్సహించటానికి 50శాతం సబ్సిడీతో విత్తనాలు అందించటం జరుగుతుందని దీనిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈకార్యక్రమంలో వైరా ఏడీఏ తుమ్మలపల్లి కరుణశ్రీ, ఎంపీడీవో జీ.సురేందర్, డీప్యూటీ తహసీల్దార్ వెంకటేశ్వర్లు, ఏవో బీ.అశోక్‌కుమార్, సోసైటీ డైరక్టర్లు అడ్డగోడ ఐలయ్య, దేగల ఉపేందర్, కొత్తురి రామారావు, మర్సకట్ల రోషయ్య, మాజీ ఎంపీపీ బానోత్ దేవ్లానాయక్, పగడాల మంజుల, మాజీ సోసైటీ చైర్మన్ ఈసాల నాగేశ్వరరావు, కార్యదర్శి బొల్లు హనుమంతరావు, సురేందర్‌మనియార్, పొలగాని శ్రీనివాస్, ఎండీ.యాకూబ్ అలీ, మాలోత్ కిషోర్‌తదితరులు పాల్గొన్నారు.

## దాసరి శోభారాణికి నివాళులర్పించిన వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్

**తల్లాడ, మే, 28( మహా):** ఆంధ్రప్రభ రీజనల్ మేనేజర్ దాసరి శ్రీనివాసరావు సతీమణి శోభారాణి ఇటీవల గుండెపోటుతో మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ విషయం తెలుసుకున్న వైరా శాసనసభ్యులు మాలోత్ రాందాస్ నాయక్ బుధవారం తల్లాడ మండలంలోని మల్లారం గ్రామంలో శ్రీనివాస్ స్వగృహానికి చేరుకొని ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. జర్నలిస్టు శ్రీనివాస్ ని పరామర్శించి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఇటువంటి సమయంలోనే నిబ్బరం కలిగి ధైర్యంగా ఉండాలని, తమ ప్రగాఢ సంతాప సానుభూతిని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఏనుగుల కిషోర్ , చలిగంటి సాయి, చలిగంటి మహేందర్, పగడాల వెంకటకృష్ణ, కుప్పాల నిర్మల రాజు, దుర్గదేవర అప్పారావు, చల్లా రామాంజనేయులు, దుగ్గిదేవర కృష్ణయ్య, తోట కృష్ణయ్య, సైదులు పాల్గొన్నారు.



## ఆపదలో అండగా నిలుస్తున్న మేదరి కుటుంబం

**కారేపల్లి, మహా** , కారేపల్లిలో ఇటివల మృతి చెందిన కుటుంబాని ఎస్సీసెల్ మండల అధ్యక్షులు మేదరి వీరప్రతాప్(టోనీ) కుటుంబం అండగా నిలిచింది. వైరాఎమ్మెల్యే మాలోత్ రాందాస్‌నాయక్ ఆదేశాలతో బుధవారం కారేపల్లిలోని ఇటివల మృతి చెందిన వడ్డేంపూడి రఘురాం(నాని) కుటుంబానికి రూ.5వేల నగదును విశ్రాంత ఉద్యోగి మేదరి ఎలిజబెత్ రాణి చేతుల మీదిగా అందజేశారు. కారేపల్లిలో ఏ ఆపద వచ్చినా మేదరి కుటుంబం తమ వంతు ఆర్థికంగా, ప్రభుత్వం పరంగా ఆదుకోవటానికి ముందుటున్నారు. సాయం అందించిన మేదరి కుటుంబానికి బాధిత కుటుంబం కృతజ్ఞతలు తెలిపింది. ఈకార్యక్రమంలో రాణి, తదితరులు పాల్గొన్నారు.

## తెలుగువారి కీర్తి ప్రతిష్టలు చాటిన మహనీయుడు నందమూరి



**దమ్మపేట ,మే28 మహా :** తెలుగు వారి కీర్తి ప్రతిష్టలను ప్రపంచం నలుమూలలా విస్తరింపజేసిన మహనీయుడు స్వర్గీయ నందమూరి తారకరామారావు అన్నారు. మండలంలోని పలు గ్రామాలలో యన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. తారక రాముని 102వ జయంతి వేడుకలు సందర్భంగా పార్టీలకు అతీతంగా అభిమానులు ,తెలుగు భాషా కోవిదులు ,వివిధ రాజకీయ పార్టీల నాయకులు వేడుకలు జరిపారు. ముష్టిబండ ,మొద్దులగూడెం ,నాగుపల్లి ,గండుగులపల్లి ,పట్వారిగూడెం ,అంకంపాలెం ,దమ్మపేట ,మందలపల్లి ,అల్లిపల్లి ,మల్కారం ప్రధాన గ్రామాల్లో యన్టీఆర్ అభిమానులు టిడిపి జెండావిష్కరణ చేసి విగ్రహానికి పూలమాలలు వేసి జై యన్టీఆర్ అంటూ నివాళులర్పించారు. పలు గ్రామాల్లో పాల్గొన్న మండల తెదేపా అధ్యక్షుడు యం.డీ. వలీపాష ఆధ్వర్యంలో పలువురు రోగులకు పాలు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేడు 29 గురువారం నాడు పట్టణ కేంద్రంలో వ్యవసాయ శాఖామంత్రి తుమ్మల నాగేశ్వరరావు చేతుల తో యన్టీఆర్ విగ్రహ ఆవిష్కరణ కానున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిద పట్టణాలనుండి తెదేపా నాయకులు ,అభిమానులు వందల సంఖ్యలో తరలిరానున్నారని ,మండలంలోని ప్రతి అభిమాని హాజరవ్వాలని కోరారు.

## సమ్మర్ క్యాంపు లు సందర్శించిన జిల్లా అధికారి

**దమ్మపేట ,మే28 మహా :** మండలంలో ని ప్రభుత్వ పాఠశాలల్లో ఉల్లాసంగా జరుగుతున్న సమ్మర్ క్యాంపు లను బుధవారం జిల్లా యువజన క్రీడా విభాగం అధికారి పరందామయ్య రెడ్డి సందర్శించారు. ముందుగా నాగుపల్లి లో విద్యార్థులు ఆడుతున్న "అత్య పత్య " క్రీడను వీక్షించారు. సమ్మర్ క్యాంపు ఇన్ చార్జ్ ,కోచ్ శివాజీ తో కొద్దిసేపు ముచ్చటించారు. పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు సరళా , అసిస్టెంట్ కోచ్ అభి ,విద్యార్థులు కార్యక్రమంలో ఉన్నారు. అదేవిధంగా దమ్మపేట మండల కేంద్రంలో ని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న సమ్మర్ క్యాంపు ను సందర్శించారు. టేబుల్ టెన్నిస్ క్యాంపు ఇన్చార్జి మల్లేశ్వరరావు , వాలీబాల్ కోచ్ రాములు ను క్రీడాకారుల ప్రతిభ గురించి ఆరా తీశారు. విద్యార్థులు వేసవి సెలవుల్లో క్రీడల పై ఆసక్తి కనబరచడం పై సంతోషం వ్యక్తం చేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఉషారాణి ని అభినందించారు. అంతేగాక కంప్యూటర్ విద్య పై కూడా ఆసక్తి పెంచేందుకు కృషి చేస్తున్న కంప్యూటర్ ఇనస్టక్టర్ గంగాధర బిపిన్ ను అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల విద్యాకమిటి చైర్మన్ పాకనాటి శ్రీనివాసరావు ఉన్నారు.

## జీళ్ళచెరువులో ఘనంగా ఎన్టీఆర్ జయంతి వేడుకలు

**కూసుమంచి, మే 28, మహా:** మండలంలోని జీళ్ళచెరువు గ్రామంలో స్వర్గీయ నందమూరి తారకరామారావు జయంతి సందర్భంగా జీళ్ళచెరువు టీడీపీ పార్టీ నాయకులు ఎన్టీఆర్ విగ్రహం వద్ద కేక్ కటింగ్ చేశారు. ముందుగా గ్రామంలో ఉన్న ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామ శాఖ అధ్యక్షులు అయితగాని నవీన్, కార్యదర్శి వెంకటేశ్వర్లు, కూసుమంచి మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు మందపల్లి కోటి, ఉపాధ్యక్షుడు అడపా శివ, మండవ వీరబాబు, కుమ్మరి కుంట్ల రామ్మూర్తి, వీరబాబు, సీనియర్ నాయకులు అయితగానికాశీలు, కోటేశ్వరరావు, అయితగాని భూషయ్య, మండల నాయకులు అలాగే జిళ్ళచెరువు తెలుగుదేశం పార్టీ అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# గిరిజనుల అభివృద్ధికి రోడ్లు, బ్రిడ్జిలు ముఖ్యం

- మంత్రి సీతక్క
- పంచాయతీరాజ్ శాఖకు సంబంధించి చురకలు
- పనితీరును మెరుగుపరుచుకునేందుకే సమీక్ష
- అంగన్వాడి అధికారులు చిల్లర రాజకీయాలు చేస్తే సహించేది లేదు
- స్వాతంత్రం వచ్చిన 75 సంవత్సరాలలో "కోయ" సామాజిక వర్గంలో నేను మాత్రమే మంత్రివర్గంలో ఉన్నా





**భద్రాద్రి కొత్తగూడెం, మే 28 (మహా):** ఉమ్మడి ఖమ్మం జిల్లా అధికారుల సమీక్ష సమావేశంలో రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా,స్త్రీ, శిశు, దివ్యాంగుల మరియు వయోవృద్ధుల సంక్షేమ శాఖ మంత్రి సీతక్క పాల్గొని ప్రసంగించారు. మహిళ, శిశు, దివ్యాంగుల మరియు వయోవృద్ధుల సంక్షేమ శాఖకు సంబంధించి, పనితనాన్ని మెరుగుపరచడానికి సమీక్ష సమావేశం నిర్వహిస్తున్నామని, యుద్ధ ప్రాతిపదిక పైన అంగన్వాడి భవన నిర్మాణాలు పూర్తి చేయాలని, దేశ భవిష్యత్తు పిల్లల చేతుల్లో, పిల్లల భవిష్యత్తు ఉపాధ్యాయులు చేతుల్లో ఉందని, ఖాళీగా ఉన్న ప్రభుత్వ భవనాలు పాఠశాలలను గుర్తించి అంగన్వాడి కేంద్రాలను అందులోకి మార్చాలని, త్వరలోనే అంగన్వాడి కేంద్రాలలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేస్తామని మంత్రి సీతక్క పేర్కొన్నారు. అంగన్వాడి అధికారులు చిల్లర రాజకీయాలు చేస్తే సహించేది లేదని మంత్రి సీతక్క హెచ్చరించారు.. అధికారులను క్షేత్రస్థాయిలో పర్యటించాలని, అంగన్వాడి అధికారులు జిల్లా ఔన్నత్యాన్ని కాపాడుకోవాలని, అంగన్వాడి కేంద్రాలలో ఏదైనా సమస్య ఉంటే అధికారులు దృష్టికి తీసుకురావాలని సీతక్క ఆదేశించారు. అంగన్వాడీ కేంద్రాలలో కాంట్రాక్టర్లు నాణ్యతలేని ఆహారాన్ని సరఫరా చేస్తే వెంటనే తిరస్కరించాలని, పిల్లల్లో పౌష్టికాహార లోపం లేకుండా నాణ్యమైన ఆహారం మాత్రమే అందించాలని, గ్రామీణ ప్రాంతాల్లో పిల్లల అలనా పాలన చూసుకోవడం కోసం క్రష్ కేంద్రాల ఏర్పాటు చేయాలని, వయోవృద్దుల సంక్షేమానికి స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని, ఆస్తులు తీసుకొని తల్లిదండ్రులను చూడని పిల్లలపై కేసులు నమోదు చేయాలని మంత్రి సీతక్క ఆదేశించారు. త్వరలోనే అంగన్వాడీ కేంద్రాలలో ఫిజియోథెరపీ సేవలు ప్రారంభమవుతాయని, వేసవి సెలవులు అనంతరం అంగన్వాడీ కేంద్రాల ప్రారంభం సెల్ఫీ విత్ అంగన్వాడీ కార్యక్రమాలు చేపట్టాలని, వికలాంగులకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని, వయోవృద్ధులకు టేక్ కేర్ సెంటర్లు ప్రారంభించాలని, తప్పుడు సమాచారంతో వార్తలు రాస్తే కేసులు పెడతామంటూ మంత్రి సీతక్క హెచ్చరించారు. అధికారులందరూ సమన్వయంతో పనిచేసి పిల్లల అభివృద్ధితో పాటు దేశ అభివృద్ధికి తోడ్పడాలని మంత్రి సీతక్క కోరారు.

**మిషన్ భగీరథ శాఖకు సంబంధించి :** గాలి తర్వాత ప్రజలకు అత్యంత ముఖ్యమైనది నీరు... దానిని ప్రజలకు అందించడమే మనందరి అంతిమ లక్ష్యమని, ప్రతి మారుమూల ప్రాంత ప్రజలకు సురక్షితమైన త్రాగునీరు అందించాలని, వారం రోజులపాటు మిషన్ భగీరథ సమస్యలపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని, త్రాగునీటి సరఫరాలో ఎటువంటి అంతరాయం లేకుండా సురక్షితమైన త్రాగునీరు అందించాలని మంత్రి సీతక్క ఆదేశించారు. నియోజకవర్గాలవారీగా మిషన్ భగీరథ ద్వారా చేపట్టిన పనులు నివేదికలు అందించాలని, మిషన్ భగీరథ ద్వారా మంజూరు అయిన మరియు చేపడుతున్న పనుల వివరాలు స్థానిక శాసనసభ్యులకు తెలియపరచాలని, ప్రతి 15 రోజులకు ఒకసారి వాటర్ ట్యాంకులను శుభ్రపరచాలని, మిషన్ భగీరథ ద్వారా చేపడుతున్న పనులు సమన్వయపరచుటకు ప్రతి నియోజకవర్గానికి ఒక నోడల్ అధికారిని నియమించాలని, తాగునీటి సరఫరాలో సమస్యలు తలెత్తితే ప్రజలకు తెలియజేయాలని, త్రాగునీటి సరఫరా సమస్యలు తెలిపితే ప్రత్యామ్నాయల ద్వారా ప్రజలకు త్రాగునీటిని సరఫరా చేయాలని, వేసవిలో త్రాగునీటి ఎద్దడి లేకుండా అన్ని చర్యలు తీసుకున్న అధికారులందరికి మంత్రి సీతక్క అభినందనలు తెలిపారు.

**పంచాయతీరాజ్ శాఖకు సంబంధించి :** మంత్రి సీతక్క మాట్లాడుతూ, మంజూరైన పనులు పూర్తి చేయడంలో ఇంత నిర్లక్ష్యమా అంటూ అధికారులకు చురకలంటించారు. టెండర్ లు పూర్తి అయినా పనులు ఎందుకు చేయడం లేదని ప్రశ్నించారు. వేసవిలో పనులు చేయకపోతే వర్షాకాలంలో చేస్తారా? కొంతమంది గుత్తేదారులకే కాంట్రాక్టులు చెబితే కుదరదు, మనకోసం కాంట్రాక్టర్లు ఉన్నారా, కాంట్రాక్టర్ల కోసం మనం ఉన్నామా? అంటూ అధికారుల పై మండిపడ్డారు. టెండర్లు పూర్తి అయ్యి పనులు ప్రారంభించని కాంట్రాక్టులను రద్దు చేయాలని మంత్రి సీతక్క ఆదేశించారు. అధికారులు పద్ధతి మార్చుకోవాలంటూ హెచ్చరించారు. పనులు త్వరితగతిన పూర్తి చేస్తే కొత్త పనులకు అనుమతులు ఇస్తామని, వారంలోగా పనులలో పురోగతి చూపించాలని, స్థానిక శాసనసభ్యులు పనుల పురోగతి పై సమీక్ష సమావేశాలు నిర్వహించాలని ,కాంట్రాక్టర్లు పనులు పూర్తి చేయకపోతే వాళ్లను బ్లాక్ లిస్టులో పెడతామని హెచ్చరించారు.

**గిరిజనుల అభివృద్ధికి రోడ్లు, బ్రిడ్జిలు ముఖ్యం...**

హెచ్ ఎ ఎం పథకం ద్వారా ప్రతి గ్రామానికి కనెక్టివిటీ ఉండే విధంగా రోడ్ల నిర్మాణాలు చేపట్టాలని, స్వాతంత్రం వచ్చిన 75 సంవత్సరాలలో "కోయ" సామాజిక వర్గంలో నేను మాత్రమే మంత్రివర్గంలో ఉన్నానని, తనకు అప్పగించిన శాఖల అభివృద్ధికి, గిరిజనుల అభివృద్ధికి కృషి చేస్తానని మంత్రి సీతక్క పేర్కొన్నారు. ఈ సమీక్షా సమావేశంలో, మహబూబాబాద్ ఎంపి పోరిక బలరాం నాయక్, ఎంఎల్ఏలు కూనంనేని సాంబశివరావు (కొత్తగూడెం), జారె ఆదినారాయణ (అశ్వారావుపేట), పాయం వెంకటేశ్వర్లు (పినపాక), తెల్లం వెంకట్రావు (భద్రాచలం), మాళోత్ రాందాస్ (వైరా) కోరం కనకయ్య(ఇల్లందు),మట్టా రాగమయి (సత్తుపల్లి), జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ ,ఉమెన్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ ప్రిన్సిపల్ సెక్రెటరీ అనిత రామచంద్రన్, ఖమ్మం స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శ్రీజ తదితరులు పాల్గొన్నారు.

## క్షయ వ్యాధి నిర్ధారణ పరీక్షలు



**టేకులపల్లి మహా :** టీవీ ముక్త్ భారత్ లో భాగంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ భాస్కర్ నాయక్, స్థానిక వైద్యాధికారి డాక్టర్ కందుల దినేష్ ఆదేశాల, మేరకు కొప్పురాయి , ఆరోగ్య ఉపకేంద్రం పరిధిలోని బర్లగూడెం, గ్రామంలో క్షయ వ్యాధిగ్రస్తుల గుర్తింపు ప్రత్యేక కార్యక్రమం, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ వజ్జా పార్వతి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... క్షయ వ్యాధి లక్షణాలైన రెండు వారాలకు మించి దగ్గు, జ్వరం, ఆకలి మందగించడం బరువు తగ్గడం, రాత్రిళ్లు చెమటలు పట్టడం, దగ్గినప్పుడు తెమడ లో రక్తం పడటం వంటివి ఉన్నట్లయితే వైద్య సిబ్బందిని సంప్రదించి దగ్గర లోని హాస్పటల్ కు వెళ్లి వ్యాధి నిర్ధారణ కొరకు తెమడ పరీక్షలు ఎక్స్ రే పరీక్షలు చేయించుకోవాలని ఒకవేళ క్షయ వ్యాధి నిర్ధారణ అయితే ఆరు నెలలు క్రమం తప్పకుండా మందులు వాడితే క్షయ వ్యాధిని పూర్తిగా నివారించవచ్చునని అనుమానితులు త్వరగా నిర్ధారణ పరీక్షలు చేయించుకొని మందులు వాడినట్లయితే ఇతరులకు వ్యాధిని సోకకుండా అరికట్టవచ్చని అన్నారు.

ANN తెలుగు
మహా పత్రిక
Follow: @ANNTELUGU
29-05-2024 | గురువారం
WWW.EPAPER.MAHAADAILY.COM
ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం


## అశ్రునయనాల మధ్య ముగిసిన మాజీ ఎమ్మెల్యే

# మదన్ లాల్ అంత్యక్రియలు



**ఖమ్మం, మహ :** రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్, మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య తదితర ప్రముఖులతో కలిసి స్వర్గీయ మదన్ లాల్ అంతిమయాత్రలో పాల్గొన్నారు, అంత్యక్రియలకు హాజరయ్యారు.వైరా మాజీ ఎమ్మెల్యే బానోత్ మదన్ లాల్ మంగళవారం తెల్లవారుజామున మృతి చెందిన విషయం తెలిసిందే.కాగా,ఆయన అంత్యక్రియలు స్వగ్రామం ఖమ్మం జిల్లా రఘునాథ పాలెం మండలం ఈర్లపూడిలో వేలాదిమంది అశ్రునయనాల మధ్య బుధవారం మధ్యాహ్నం జరిగాయి.ఈ సందర్భంగా ఎంపీ రవిచంద్ర, మాజీ మంత్రి అజయ్ కుమార్, మాజీ ఎమ్మెల్యే వెంకటవీరయ్య, డీసీసీబీ మాజీ ఛైర్మన్ కూరాకుల నాగభూషణం, బీఆర్ఎస్ నాయకులు బొమ్మెర రాంమూర్తి,రాకేష్ రెడ్డి తదితర ప్రముఖులు హాజరై దివంగత మదన్ లాల్ పార్థివదేహంపై పూలదండలు వేసి శ్రద్ధాంజలి ఘటించి, కుటుంబ సభ్యులను పరామర్శించారు.ఆ తర్వాత మదన్ లాల్ అంతిమయాత్ర సందర్భంగా ఆయన భౌతికకాయాన్ని ఉంచిన పాడేను ఎంపీ వద్దిరాజు, మాజీ మంత్రి పువ్వాడ తదితరులు తమ భుజాలపై మోశారు.డప్పు చప్పుళ్లు,టపాకాయలు కాలుస్తూ బీఆర్ఎస్ శ్రేణులు,ఈర్లపూడి,దాని పరిసర ప్రాంతాల వాసులు, బంధు మిత్రులు, శ్రేయోభిలాషులు,అభిమానులు దివంగత మదన్ లాల్ పార్థివ దేహంపై పూలుజల్లుతూ అశ్రునయనాలతో తుది వీడ్కోలు పలికారు.ఈ సందర్భంగా "అమర్ హై అమర్ హై మదన్ లాల్ అమర్ హై,"జిందాబాద్ జిందాబాద్ బీఆర్ఎస్ జిందాబాద్"అనే నినాదాలు హోరెత్తగా ఈర్లపూడి వీధుల గుండా అంతిమయాత్ర సుమారు రెండున్నర గంటల పాటు సాగింది. ఎంపీ రవిచంద్ర, మాజీ మంత్రి అజయ్ కుమార్, ఎమ్మెల్యే డాక్టర్ పల్లా రాజేశ్వర్ రెడ్డి,మాజీ ఎమ్మెల్యే వెంకటవీరయ్య తదితర ప్రముఖులు దగ్గర ఉండి మదన్ లాల్ వ్యవసాయ క్షేత్రంలో కుమారుడు మృగేందర్ లాల్ చేత అంతిమ సంస్కారాలు జరిపించారు.













## వైరా మాజీ ఎమ్మెల్యే అంత్యక్రియాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే పల్లా

**మహా :** వైరా మాజీ ఎమ్మెల్యే, ప్రస్తుత బిఆర్ఎస్ నియోజకవర్గ ఇంచార్జ్ బానోత్ మదన్ లాల్ అంత్యక్రియలు రఘునాథపాలెం మండలం ఈర్ల పూడి గ్రామంలో బుధవారం నిర్వహించారు. ఈ అంతిమ యాత్రలో జనగామ ఎమ్మెల్యే డా. పల్లా రాజేశ్వర్ రెడ్డి పాల్గొని మదన్ లాల్ గారి పార్థివ దేహం పై పూలమాలలు చల్లి నివాళులు అర్పించారు. అనంతరం వారి కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు.



# డబ్బు ఇస్తేనే ఎంట్రీ..

## రెవిన్యూ కార్యాలయాల్లో చిరుద్యోగుల హవా

## డీలర్ల అండతో సాగుతున్న రేషన్ దందా

## ప్రతిష్టాత్మక పథకానికి అవినీతి మచ్చ

**2000 ఇస్తేనే రేషన్ కార్డు**





**ఖమ్మం , మహా :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రజల ఆర్థిక భద్రత కోసం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన రేషన్ కార్డుల జారీ ప్రక్రియ ఖమ్మం జిల్లాలో మాత్రం అవినీతి తిప్పలలో మగ్గుతోంది. నిజంగా అర్హత కలిగిన పేద కుటుంబాలకు కార్డులు ఆలస్యం అవుతుండగా, రూ.2000 లంచం ఇచ్చినవారికి మాత్రం వెంటనే అందుతున్న వాస్తవం వెలుగులోకి వచ్చింది. మండల రెవెన్యూ కార్యాలయాల్లో ఉద్యోగుల చేతుల్లోకి వచ్చిన ఈ పవిత్ర పథకం నడక ఇప్పుడు 'లంచాలపై ఆధారపడి సాగే వ్యవస్థ'గా మారింది. ఈ దుర్వ్యవస్థ వెనుక డీలర్లకు ఉన్న స్థానిక అండ, చిరువుద్యోగి చూపుతున్న కణతల వైనం స్పష్టంగా కనిపిస్తోంది.

జిల్లా వ్యాప్తంగా పలు రెవెన్యూ కార్యాలయం ఆవరణలో ఎప్పుడు కనబడని స్థాయిలో రేషన్ కార్డుల కోసం జనం తపన పడుతున్నారు. అయితే ఈ తపనను క్యాష్ కౌంటరుగా మలిచిన ఓ చిరు ఉద్యోగుల కార్యాలయ వ్యవస్థను ధ్వంసం చేస్తున్న వైనం బయటపడింది. ప్రతి దరఖాస్తుదారుని నుంచి రూ.2000 వసూలు చేస్తూ, అప్పుడే వారి వివరాలను ఆన్లైన్‌లో నమోదు చేస్తున్నట్టు తెలిసింది. డబ్బు ఇవ్వనివారిని 'ఫైల్ పెండింగ్' పేరిట చివరికి నాశనానికి నెట్టే ప్రయత్నం జరుగుతోంది. వాస్తవానికి ఈ కార్యాలయం ఒక ప్రజాసేవా కేంద్రంగా ఉండాలి. కానీ ప్రజల ఆశలు, నమ్మకాలను నిర్వీర్యం చేస్తూ అది ఒక 'లంచాల వసూలు కేంద్రం'గా మారిపోయింది. "రేషన్ కార్డు కోసం రెండు నెలలుగా తిరుగుతున్నా.. రూ.2000 ఇవ్వలేదని నా ఎంట్రీ పెట్టలేదు" అని ఓ మహిళ వాపోయింది. స్థానికుల బీభత్స అనుభవాలే దీనికి ప్రత్యక్ష సాక్ష్యం.

**★ డీలర్ల అండ, అధికారులు మూగ వైఖరి.**

ఈ వ్యవస్థ వెనుక స్థానిక రేషన్ డీలర్ల ప్రమేయం ఉందన్న ఆరోపణలు మారు మోగుతున్నాయి. వారు ఆధారాలుగా తమ పరిధిలోని ప్రజల పేర్లు తప్పుడు వివరాలతో సమర్పిస్తూ కార్డులు సాధ్యంగా చేసుకుంటున్నట్లు తెలిసింది. దీనిపై రెవెన్యూ అధికారులు మాత్రం మౌనంగా వ్యవహరిస్తుండటం ఆశ్చర్యకరం.

**★ సాంకేతికతను దుర్వినియోగం చేస్తున్న వ్యవస్థ.**

ఆన్‌లైన్‌లో ఫీల్డ్ రిపోర్ట్‌లు, ఆధార్ లింక్, ఆధారాల పరిశీలన వంటివి అధికారులు సాంకేతికత ఆధారంగా నిర్వహించాలని ప్రభుత్వ ఆదేశాలు ఉన్నా, దీన్ని కూడా లంచాల అడ్డంపెట్టుకొని దుర్వినియోగం చేస్తున్నారు. "డబ్బు ఇస్తేనే ఆధార్ లింక్ చేస్తారు, లేదంటే పేరు కనిపించదంటున్నారు" అనే వాపోతులు ప్రజల్లో వెల్లువెత్తుతున్నాయి.

**★ ప్రభుత్వ ప్రతిష్ఠకు మచ్చ.**

రేషన్ కార్డుల పంపిణీ రాష్ట్ర ప్రభుత్వ నమ్మకాన్ని ప్రతిబింబించే అంశం. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శ్వేతపత్రాలపై ఎక్కువగా దృష్టి సారిస్తూ వ్యవస్థ పారదర్శకత కోసం పూనుకుంటున్నారు. కానీ స్థానిక అధికారుల చేతుల్లో అవినీతికి కట్టడి లేకుండా పోతే, ప్రభుత్వ ప్రతిష్ఠే దెబ్బతినే ప్రమాదం ఉంది.

**★ పరిశీలన...చర్యలు అవసరం.**

ఈ వ్యవహారం జిల్లాలోని పలు రెవెన్యూ కార్యాలయంలో ఆకుతో పోయింది. రెవెన్యూ డిపార్టుమెంట్ ఆధ్వర్యంలో ప్రత్యేక దర్యాప్తు జరిపి, సంబంధిత ఉద్యోగులపై కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం తీవ్రంగా కనిపిస్తోంది. ప్రజలకు న్యాయం చేయాల్సిన సేవా కేంద్రాలు లాభాల దందా కేంద్రాలుగా మారడం ప్రజాస్వామ్యానికి మచ్చతానంగా మారుతోంది.



# రైతుల ముంగిట్లో శాస్త్రవేత్తలు



**టేకులపల్లి మహా :** టేకులపల్లి మండలం బోడు గ్రామ రైతు వేదిక లో రైతుల ముంగిట్లో శాస్త్రవేత్తల కార్యక్రమం, మండల వ్యవసాయ అధికారి అన్నపూర్ణ, ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ ఈ సందర్భంగా రైతులు యూరియా వాడకం తగ్గించుకుంటే భూమి సారవంతం పెరుగుతుందని, నీటి వనరులను కాపాడుకోవడానికి సేంద్రియ వ్యవసాయ విధానం అలవాటు చేసుకోవాలని నీటి కుంటల నిర్మాణం చేపట్టాలని పంట మార్పిడి ద్వారా మునగా పామాయిల్ వెదురు పంటలు వైపు మొగ్గు చూపాలని రైతులకు సూచించారు ఈ కార్యక్రమంలో కెవికె కోఆర్డినేటర్ లక్ష్మి, నారాయణమ్మ, శాస్త్రవేత్త శివ, ఏడీఏ లాల్చంద్, ఏవో అన్నపూర్ణ, ఏ ఈ ఓ రమేష్ తదితరులు పాల్గొన్నారు

## చెడు వ్యసనాలపై జరిగే పోరాటంలో

# యువత కదిలి రావాలి

**నేలకొండపల్లి, మే 28 మహా:** గంజాయి డ్రగ్స్ మాదకద్రవ్యాలు, ఆన్లైన్ బెట్టింగ్ వంటి చెడు వ్యసనాలపై జరిగే పోరాటంలో యువత కదిలి రావాలని డివైఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి బొడ్డు మధు పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక రావెళ్ళ భవనంలో విలేకరులతో ఆయన మాట్లాడారు. గంజాయి, డ్రగ్స్, మాదక ద్రవ్యాలు నిర్మూలించాలని, ఆన్‌లైన్ బెట్టింగ్ యాప ్లు నిషేధించాలని కోరుతూ డివైఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 30 నుండి డివైఎఫ్ఐ యువ చైతన్య సైకిల్ యాత్రను జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నేడు గంజాయి డ్రగ్స్ మాదక ద్రవ్యాలు ఆన్లైన బెట్టింగ్ మహమ్మారిలు యువతను పట్టిపీడిస్తూ వారి జీవితాలను చిన్నాభిన్నం చేస్తున్నాయన్నారు. గంజాయి, డ్రగ్స్, మద్యం, మాదిక ద్రవ్యాలు పట్టణ ప్రాంతాల నుండి నేడు గ్రామాలకు, మారుమూల పల్లెలకు కూడా విస్తరించిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మహమ్మారి వల్ల 17 ఏళ్ల నుండి 40 ఏళ్ల వయసు వారు ఎక్కువగా యువత ఆరోగ్యాలు దెబ్బతిని చనిపోతూ కుటుంబాలను విషాదంలో ముంచుతున్నారన్నారు. ఈ ప్రమాదకర మాదక ద్రవ్యాలను బెట్టింగ్ యాప్స్ ను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నిషేధించాలని వాటి బారిన యువత పడకుండా చైతన్యవంతం చేయడం కోసమే సైకిల్ యాత్రలు నిర్వహిస్తున్నామని తెలిపారు. యువత చెడు వ్యసనాలకు లోను కాకుండా ప్రభుత్వాలు వారికి ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించాలని, యువతకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని, నిరుద్యోగి యువకులకు నిరుద్యోగ భృతి ఇవ్వాలనే లక్ష్యంతో యువ చైతన్య సైకిల్ యాత్ర చేపట్టి ప్రతి గ్రామంలో విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తూ యువత సమస్యలు తెలుసుకుంటూ చైతన్యవంతం చేయనున్నట్లు తెలిపారు. ఈ సైకిల్ యాత్రలో యువత అధిక సంఖ్యలో పాల్గొని సంఘీభావం తెలిపి సంపూర్ణ సహకారం అందించాలని కోరారు.

# బోడులో ఘనంగా ఎన్టీఆర్ జయంతి



**టేకులపల్లి మహా :** మండల పరిధిలోని బోడు గ్రామంలో మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు జయంతి వేడుకలను బుధవారం రాత్రి తెదేపా నాయకులు, అభిమానులు ఘనంగా నిర్వహించారు. ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తెలుగు జాతి ఉన్నంతకాలం ఎన్టీఆర్ కీర్తి అజరామరమని వారు కొనియాడారు. ఈ కార్యక్రమంలో తెదేపా నాయకులు రేఖ రామచందర్, చిలువేరు నాగేశ్వరరావు, చిలువేరు శ్రీనివాస్, గంగాధర సత్యనారాయణ, మాసిపాక రామస్వామి, ఇర్ప సమ్మయ్య, అడపా సమ్మయ్య, రవిశంకర్, జనసేన నాయకులు చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.